# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-11-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం ఈ ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**

2. **రాష్ట్రంలోని మూడు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

3. **యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నాయని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చెప్పారు.**

4. **వరంగల్ టెక్స్ టైల్ పార్కు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 200 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు.**

5. **రైతులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాలు శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు.**

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 128వ సంచిక ఈరోజు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

రాష్ట్రంలోని మూడు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయానికి ఆయన నిన్న హాజరై.. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ముఖ్యమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. మూడు ప్రాంతాల అభివృద్ధి కోసం జోన్లు ఏర్పాటు చేస్తామన్నారు. అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాజధాని రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. రాష్ట్రంలో అవినీతి నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

---------------------------

యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నాయని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళలో ఉద్యోగాలు పొందిన వారికీ నియామక పత్రాలను ఆయన నిన్న అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస వర్మ మాట్లాడుతూ.. త్వరలో రాష్ట్రంలోని అనకాపల్లి, రామాయపట్టణం ప్రాంతాల్లో ఏర్పాటు చేయబోయే పరిశ్రమల్లో లక్షా 40 వేల ఉద్యోగాలకు అవకాశం ఉందన్నారు.

---------------------------

వరంగల్ టెక్స్ టైల్ పార్కు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 200 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. టెక్స్ టైల్ పార్కు ఉద్యోగాల్లో స్థానికులకే అధిక ప్రాధాన్యం ఉంటుందన్నారు. తెలంగాణలోని వరంగల్ జిల్లాలో ఆయన నిన్న పర్యటించారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను పరిశీలించారు. వరంగల్ కోటను పరిరక్షించాలని ముఖ్యమంత్రి సీఎస్ కు లేఖ రాస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ..

వాయిస్..32 సెకన్లు

---------------------------

ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ పథకాన్ని అమలు చేస్తుందని కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం జల జీవన్ మిషన్ పథకాన్ని ప్రణాళికా బద్ధంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటుదన్నారు.

---------------------------

రైతులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాలు శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. బాపట్ల జిల్లా, నడింపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ పాత్రికేయులతో మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యం మొత్తాన్ని ప్రభుత్వం కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో 51 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

ఆకాశవాణి 67వ సంగీత సమ్మేళనంలో భాగంగా ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం కర్ణాటక గాత్ర సంగీతం, జానపద సంగీత కచేరీలను నిన్న సాయంత్రం ఘనంగా నిర్వహించింది. హైదరాబాద్ నాంపల్లిలోని శ్రీ సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ కళామందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ గేయ రచయిత రామజోగయ్య శాస్త్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

విద్వాన్ డి.వి. మోహన కృష్ణ కర్ణాటక గాత్ర సంగీత కచేరీ ఆహూతులను సమ్మోహన పరిచింది. విద్వాన్ ఆర్ దినకర్ వయొలిన్‌తో, విద్వాన్ యల్లా వెంకటేశ్వరరావు మృదంగ పైనా, కె. శ్యామ్ కుమార్ కంజీరతో సహకారం అందించారు. ప్రముఖ గాయకులు పత్రి కుమారస్వామి, అరుణ సుబ్బారావు ఆలపించిన జానపద గీతాలు ఆహూతులను అలరించాయి. కె.వి.ఎన్.రవిశంకర్ వేణువుతో, ఓ.వి.ఎస్.గురు ప్రసాద్ కీ బోర్డుతో, టి.మోహన్ ఢోలక్ పై వాద్య సహకారం అందించారు. సంగీత అభిమానులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

-------------------------

"దేశమంటే మట్టికాదోయ్– దేశమంటే మనుషులోయ్" అంటూ తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన సాహితీకారులు ప్రముఖ రచయిత మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతి ఈ రోజు. 1862 సెప్టెంబర్ 21వ తేదీన విశాఖ జిల్లా ఎలమంచలి తాలూకా రాయవరం గ్రామంలో ఆయన జన్మించారు. గురజాడ రాసిన కన్యాశుల్కం నాటకం తెలుగు నాట అత్యంత ప్రసిద్ధి పొందింది. తన రచనలద్వారా సాంఘిక పరివర్తనకు విశేష కృషిచేసిన గురజాడ అప్పారావు 1915 నవంబర్ 30న తుది శ్వాస విడిచారు.

-------------------------

దిత్వా తుఫాన్ నేపథ్యంలో అత్యవసర సహాయక చర్యల కోసం కడపలో 2 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, వెంకటగిరిలో 3 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉంచామని ఆంధ్రప్రదేశ్ విపత్తులు నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. తుపాను గమనాన్ని పర్యవేక్షిస్తూ ప్రభావం చూపే జిల్లాల యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాఖల వారీగా తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశామన్నారు. సముద్రంలో వేటకి వెళ్లిన మత్స్యకారులని వెనక్కి రప్పించామని, రైతాంగానికి భారీవర్షాల నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అప్రమత్తం చేశామని పేర్కొన్నారు. ప్రజలకు హెచ్చరిక సందేశాలు పంపిస్తున్నామన్నారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాకు రెడ్ అలెర్ట్ జారీ చేయబడిందని పేర్కొన్నారు. భారీ వర్షాలతో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

-------------------------

నైరుతి బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న ఉత్తర శ్రీలంక మీదుగా కొనసాగుతున్న దిత్వా తుపాను గంటకు 10 కి.మీ వేగంతో ఉత్తరం వైపుకు కదులుతుందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇది ప్రస్తుతానికి పుదుచ్చేరికి 220 కిలో మీటర్లు, చెన్నైకి 330 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని తెలిపింది. తుపాను ఉత్తర–వాయువ్య దిశగా ప్రయాణిస్తూ ఈ తెల్లవారుజామున ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దానికి ఆనుకుని ఉన్న దక్షిణకోస్తాంధ్ర తీరాల సమీపంలోకి చేరుకుంటుందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు తెలిపారు. దీని ప్రభావంతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అనేక చోట్ల కురిసే అవకాశం ఉందని తెలియజేస్తూ..

వాయిస్...27 సెకన్లు

====================